బడీడు పిల్లలను పాఠశాలలకు పంపించాలి

హుస్నాబాద్‌టౌన్: స్థానిక నేతాజీనగర్‌లో పిల్లలతో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



కోహెడ: శనిగరంలో బడిబాట గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

- కొనసాగుతున్న బడిబాట
- ఇంటింటికీ వెళ్తున్న టీచర్లు

మిరుదొడ్డి: ఆరేపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 11: సర్కారు బడుల సార్లంతా ఇండ్ల బాట పట్టారు. బడిబాటలో భాగంగా హుస్నాబాద్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు పట్టణంలోని పలువార్డుల్లోని ఇండ్లకు వెళ్లి పిల్లలను పలకరిస్తున్నారు. ఈ ఏడాది కూడా మీరు చదువుకునే బడికి రావాలని, మిగతా పిల్లలను ఇదే బడికి తీసుకురావాలంటూ సూచిస్తున్నారు. మంగళవారం స్థానిక నేతాజీ నగర్, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లకాలనీలకు వెళ్లి పిల్లలు, వారితల్లిదండ్రులతో మాట్లాడి స్కూల్‌కు పంపించాలని, పలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాశ్, రాజమల్లయ్య, వీరారెడ్డి పాల్గొన్నారు.

ఆరేపల్లిలో..

మిరుదొడ్డి, జూన్ 11: మండలంలోని ఆరేపల్లిలో ఉపాధ్యాయులు బడి బాట నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులను బడికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ఆయా గ్రామాల్లో..

కోహెడ, జూన్ 11: మండలంలోని శనిగరం,తంగల్లపల్లి గ్రామాల్లో అధికారులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా గ్రామపంచాయతీ వద్ద గ్రామసభ నిర్వహించారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య, అనుభవం, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం. సరళ, ఎస్.పద్మ,టి సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించి సహాయ సహకారాలు అందించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోనే శేఖర్, కొంపెల్లి స్వప్న, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మోగనున్న బడిగంట

సిద్దిపేట అర్బన్, జూన్ 11 : వేసవి సెలవులు ముగియడంతో 2024-25 నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. వేసవి సెలవులు రావడంతో విద్యార్థులంతా ఆటపాటల్లో మునిగి తేలి.. నేడు బడి బాట పట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా 976 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా 814 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పనులు చేపట్టారు. ఈ మేరకు విద్యుత్, తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ తదితర మరమ్మత్తు పనులు చేపట్టారు.చాలా పాఠశాలల్లో పనులు ఇంకా పూర్తి కాని పరిస్థితి ఏర్పడింది. పాఠశాల పునఃప్రారంభమవుతున్నప్పటికీ చాలా పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదని, వాటిని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని, పనులు పూర్తిచేయని అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఓ వైపు బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ఈ నెల 19వ తేదీ వరకు బడిబాట కొనసాగనుంది.

స్విమ్మింగ్‌పూల్‌లో సౌకర్యాలపై ఆరా

స్విమ్మింగ్‌పూల్‌ను సందర్శించి సౌకర్యాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట, జూన్ 11: సిద్దిపేటలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌ను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సందర్శించారు. ఈ సందర్భంగా సిమ్మింగ్‌పూల్ నిర్వాహకులతో మాట్లాడారు. ప్రమాదాలు జరుగకుండా స్విమ్మింగ్‌పూల్ సిబ్బంది లైఫ్ గార్డ్స్ ఉన్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్విమ్మింగ్ పూల్‌లో ఉన్న స్థానాల గదులు, వాటి నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిమ్మింగ్‌పూల్ నిర్వహణపై అదనపు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా క్రీడలు యువజనశాఖ అధికారి నాగేందర్, స్విమ్మింగ్ పూల్ నిర్వాహకుడు మహేశ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మెదక్ డీసీసీబీ చైర్మన్



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మెదక్ డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 11 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో సీఎం అధికార నివాసంలో మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట కొండపాక ఎంపీపీ మంచాల అనసూయ కనకరాములు, ఎంపీటీసీ ఆరుట్ల లక్ష్మీకనకయ్య, సురేందర్‌రెడ్డి, అంబటి వేణు, బైరు ప్రణీత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అగ్ని వీరులకు సత్కారం

అగ్నివీరులను సన్మానించిన అధ్యాపకులు

సిద్దిపేట టౌన్,జూన్ 11 : దేశ రక్షణలో పాలుపంచుకునే అవకాశం అందరికీ రాదని.. దేశానికి సేవ చేసే అదృష్టం సిద్దిపేట కళాశాల విద్యార్థులకు రావడం గర్వంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం నుంచి 11 మంది 7 నెలలు కఠిన సైనిక శిక్షణను పూర్తి చేసుకొని త్వరలో విధుల్లో చేరనున్న అగ్నివీరులను మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ,ఐకమత్యానికి మారుపేరుగా నిలిచిన కళాశాల ఎన్‌సీసీ విభాగం నుంచి అగ్నివీరులుగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.విద్యార్థులు దేశభక్తిని పెంచుకోవాలని..రక్షణకు ముందుండాలని పిలుపునిచ్చారు.అధ్యాపకులు అయోధ్యరెడ్డి,సుదర్శనం,మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తిచేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్

చేర్యాల, జూన్ 11 : పాఠశాలలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపా రాణీశ్రీధర్‌రెడ్డి కోరారు.మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులోని కురుమవాడ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను మంగళవారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పాఠశాలలో వసతులు కల్పించేందుకు సర్కారు ప్రారంభించిన పనులను సకాలంలో పూర్తి చేస్తే విద్యార్థులకు వసతి కలుగుతుందని, లేని పక్షంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతారన్నారు.కార్యక్రమంలో కార్యక్రమంలో హెచ్‌ఎం వాణిశ్రీ, ఏఈ శ్రీకాంత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు ధన్యవాదాలు

సిద్దిపేట, జూన్ 11: దేశంలోనే జిల్లాను ఆదర్శంగా నిలుపడంలో ఉద్యోగులు కష్టపడి పని చేశారని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కోమండ్ల విక్రం రెడ్డి అన్నారు. మంగళవారం టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సమావేశం సిద్దిపేటలో జిల్లా అధ్యక్షుడు గ్యాదర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించిన ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగుల వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న కలెక్టర్ మనుచౌదరికి ఉద్యోగుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మారం జగదీశ్వర్‌కు జిల్లా పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. టీఎన్జీవో సహా అధ్యక్షుడు నిమ్మ సురేందర్‌రెడ్డి, కోశాధికారి అశ్వక్‌అహ్మద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ వద్ద మందుబాబుల వీరంగం

చేర్యాల, జూన్ 11 : పట్టణంలోని పెద్దచెరువు కట్ట పై ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ వద్ద రోజురోజుకూ మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. సోమవారం రాత్రి మందుబాబులు ఓపెన్ జిమ్ వద్ద మద్యం తాగి సీసాలను పగులగొట్టారు.సీసాలను పగులగొట్టడమే కాకుండా సీసాలను ముక్కలుముక్కలుగా చేసి వాటిని ఓపెన్ జిమ్ ప్రదేశంలో వెదజల్లారు. ఉదయం జిమ్ చేసుకునేందుకు వెళ్లిన పలువురు వాకర్లు విషయాన్ని గమనించి మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. కొన్ని మాసాలుగా జిమ్‌వద్ద గుర్తు తెలియని వ్యక్తులు హంగామా చేస్తున్నారు. ఓపెన్ జిమ్ వద్ద కొనసాగుతున్న కార్యకలాపాలకు చెక్ పెట్టాలని వాకర్స్ గ్రూపు సభ్యులు కోరుతున్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

సిద్దిపేట, జూన్ 11 : స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి బాలుడు మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణం మారుతీనగర్‌కు చెందిన జాన్‌బాబు, సందీప పెద్దకుమారుడు గిరీశ్ (17) బాసర ట్రిపుల్ ఐటీలో చదువుతున్నాడు. మేనబావ సాయికిరణ్‌తో కలిసి మంగళవారం సాయంత్రం ఈతకు వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో లోతుగా ఉన్న ప్రాంతం వైపు వెళ్లి గిరీశ్ మునిగిపోయాడు. అక్కడే ఈత కొడుతున్న వారు కేకలు వేశారు. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది అతన్ని పైకి తీసి సీపీఆర్ చేశారు. అనంతరం సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్షం..రైతుల హర్షం

దుబ్బాక,జూన్11: దుబ్బాకలో మంగళవారం సాయంత్రం వర్షం పడడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే కర్షకులు పంట సాగుకు సమాయత్తమయ్యారు. దుబ్బాక పట్టణంలోని పలు వార్డుల్లో మురుగుకాల్వలు నిండి బురదమయంగా మారాయి.

అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

మంత్రి సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, జూన్ 11: గజ్వేల్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు ఇవ్వాలని, అందులో అనర్హులుంటే తొలిగించాలని కోరుతూ మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గతంలో అధికారులు తీసిన డ్రాలో కొంత మంది అనర్హులు ఉన్నారని, వారిని జాబితాలో నుంచి తొలిగించి సమగ్ర సర్వే ద్వారా అర్హులను ఎంపిక చేయాలన్నారు. సొంత ఇల్లు ఉన్నవాళ్లకు ఇందులో అవకాశం రావడంలో ఎన్నో ఏండ్లుగా అద్దె ఇండ్లలో నివాసం ఉంటున్న వారికి అన్యాయం జరుగుతుందని, అందుకు వెంటనే సమగ్ర సర్వే కోసం జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, నర్సింహులు, వెంకటచారి, పద్మ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

గజ్వేల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజు

గజ్వేల్, జూన్ 11: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ బాబునాయక్ హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను ఏవో నాగరాజుతో కలిసి ఆయన తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను అధిక ధరలకు అమ్మాలని చూసినా చర్యలు తప్పవన్నారు. తప్పకుండా రైతులకు రసీదు ఇవ్వాలని, విధిగాస్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ధరల పట్టికను దుకాణం ఎదుట ప్రదర్శించాలన్నారు. రైతులను మోసం చేయాలని ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు పెడుతామని డీలర్లకు హెచ్చరించారు. కల్తీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని, గడువు ముగిసిన విత్తనాలతో పాటు లూస్ విత్తనాలు విక్రయించొద్దన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సురేందర్, రమేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

హుస్నాబాద్, జూన్ 11: కల్లుగీత వృత్తిలో భాగంగా తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందిన వారితో పాటు గాయాలపాలై వృత్తికి దూరమైన గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామిగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గీత కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకున్నా, ఎక్స్‌గ్రేషియా నిధులు విడుదల చేయకపోయినా గీత కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. గీత కార్మికులను ప్రమాదాల నుంచి కాపాడేందుకు బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పరిశోధనలు చేయించారని, ఆయన ప్రతిపాదించిన విధంగా సేఫ్టీ మోకులు ఉచితంగా అందజేయాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గౌడ సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్ గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సంఘం నాయకులు చీకట్ల రవీందర్‌గౌడ్, రంజిత్‌కుమార్‌గౌడ్, ఎల్లయ్యగౌడ్, రాంబాబుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యంగౌడ్, నారాయణగౌడ్, రమేశ్‌గౌడ్, సంపత్‌గౌడ్, మొగిలిగౌడ్, ముత్తయ్యగౌడ్, సునీల్‌కుమార్ గౌడ్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

వర్షాలకోసం అభిషేకం

గజ్వేల్, జూన్ 11: వర్షాలు సంపృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని కోరుతూ మంగళవారం రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామరాజు 11కోట్ల 11లక్షల 11వేల లిఖిత రామనామాలతో అద్దాల మందిరం వద్ద సీతారాములకు అభిషేకం చేశారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

హుస్నాబాద్, జూన్ 11: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో పాటు ఇద్దరు మహిళలను బైక్‌పై తీసుకొస్తున్న వ్యక్తి నిర్లక్ష్యం ఇద్దరు మహిళల నిండు ప్రాణాలను బలిగొంది. ఇందులో ఏ ఒక్కరు కొంచెం ఆలోచించి వాహనాలను నెమ్మదిగా నడిపినా రెండు నిండు ప్రాణాలు బతికుండేవి. అక్కన్నపేట మండల కేంద్రం శివారులో సోమవారం జరిగిన రోడు ప్రమాదం హుస్నాబాద్ ఉమ్మడి మండలంలో విషాదాన్ని నింపింది. ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందడంపై సర్వత్రా సంతాపం వ్యక్తమవుతోంది. హుస్నాబాద్ నుంచి జనగామకు వెళ్తున్న ఆర్టీసీ హైర్‌విత్ బస్సు, అక్కన్నపేట మండలం పంతుల్‌తండా నుంచి కూలీ పనుల కోసం బైక్‌పై వెళ్తున్న వారిని ఢీకొట్టడంతో కరంటోతు కవిత(32) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా ఇదే బైక్‌పై వెళ్తూ ప్రమాదంతో తీవ్ర గాయాలైన కరంటోతు స్వరూప (30) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. బైక్ నడుపుతున్న స్వరూప భర్త రాజు గాయాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బైక్ నడుపుతున్న రాజు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. మృతుల్లోని కవితకు భర్త రవితోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. స్వరూపకు భర్త రాజు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. చికిత్స పొందుతూ మృతి చెందిన స్వరూప మృతదేహానికి పంచనామా నిర్వహించి వరంగల్ ఎంజీఎంలోనే పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు గిరిజన మహిళలు మృతి చెందడంతో ఉమ్మడి మండలంలోని హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మద్దూరు(ధూళిమిట్ట): గాగిళ్లాపూర్‌లో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బెజ్జంకి: బోనాలతో వెళ్తున్న మహిళలు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్11: మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం అలివేలుమంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చనలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం మహా అన్నదానం చేశారు. సాయంత్రం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అర్చకులు, నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మకు బోనాలు

బెజ్జంకి, జూన్ 11: మండలంలోని వీరాపూర్‌లోని ఎస్సీ కులస్తులు ఎల్లమ్మకు మంగళవారం ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో గ్రామ పుర వీధులగుండా డప్పుచప్పుళ్ల మధ్య వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం

అమ్మవారికి పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

హుస్నాబాద్, జూన్ 11: ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ జాతర భక్తజన సంద్రంగా మారింది. అమ్మవారికి ఇష్టమైన మంగళవారం కావడంతో ఉదయం నుంచే జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో సహా వచ్చి నిద్ర చేసి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్నం వేసి, బోనంతో పాటు మేకలు, కోళ్లు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. బైండ్ల పూజారులు పట్నం వేసి బోనాలు చెల్లించి అమ్మవారి కథ చెప్పి భక్తులను అలరింపజేశారు. అమ్మవారి దర్శనానికి సుమారు గంటన్నర సమయం పట్టింది. ఆలయం ఆవరణలోనే వంటలు చేసుకొని కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయ ఈవో కిషన్‌రావుతో పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ నెల 24వ తేదీ వరకు జాతర కొనసాగనుంది.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

పూజలుచేస్తున్న దేవాదాయశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రావు

హుస్నాబాద్, జూన్ 11: హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రావు మంగళవారం సాయం త్రం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం లో జరుగుతున్న అభివృద్ధి పనులు, దేవాలయం పూర్వ చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయం ఎదుట మండపం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆలయ ఆవరణను సందర్శించి భక్తులకు కావాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, ఈవో కిషన్‌రావు, పూజారి పరమేశ్వరశర్మ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలి

గజ్వేల్, జూన్ 11: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వచ్చే నెల 7న వరంగల్‌లో నిర్వహించతలపెట్టిన మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పరశురామ్, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముండ్రాతి కృష్ణమాదిగ, మైసరాములు కోరారు. మంగళవారం గజ్వేల్‌లోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రమేశ్, రాములు, శ్రీహరి, కరుణాకర్, మహేశ్ పాల్గొన్నారు.

నేతాజీ విగ్రహావిష్కరణ

బెజ్జంకి, జూన్ 11: మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌లో ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చేర్యాల, జూన్ 11 : పట్టణంలోని పెద్దచెరువు కట్ట, పాత పెట్రోల్ బంక్, హనుమాన్ ఆలయం (జనగామ నుంచి సిద్దిపేట) రోడ్డుకు ఎడమ వైపు ఉన్న ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకువిద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ రత్నాచారి తెలిపారు.

గజ్వేల్‌లో

గజ్వేల్, జూన్ 11: గజ్వేల్ పట్టణంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మారుతి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బాలాజీ ఎన్‌క్లేవ్, సిరి ఎన్‌క్లేవ్, లక్ష్మీప్రసన్ననగర్, కోర్టు ఏరియా, టీవీఎస్ గల్లీ, శివాలయం గల్లీ ఏరియాల్లో ఉదయం 6గంటల నుంచి 8:45గంటల వరకు, సంతోష్ థియేటర్ ఏరియా, రాజిరెడ్డిపల్లి, బీడీ కాలనీ, ధనలక్ష్మీకాలనీ, మహతి స్కూల్ ఏరియా, పిడిచేడ్ రోడ్డులో ఉదయం 10 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చేర్యాల, జూన్ 11 : నంగునూరు మండలంలోని ఖాతా గ్రామ వాగు నుంచి చేర్యాల పట్టణానికి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ అహ్మద్‌ఖాన్ మంగళవారం విలేకరులకు తెలిపారు.అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

నేడు ఇసుక డంపునకు వేలం

చేర్యాల మండలంలోని కమలాయపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపునకు బుధవారం వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. 15 ట్రాక్టర్ల ఇసుక డంపునకు ఉదయం 11గంటలకు నిర్వహించే వేలం పాటలో ఆసక్తిగల వారు పాల్గొనవచ్చన్నారు.

సామగ్రి పంపిణీ

సిద్దిపేట టౌన్,జూన్ 11 : సిద్దిపేట శ్రీభారతి వేద పాఠశాల విద్యార్థులకు రమాశ్రీనివాస్ దంపతుల సహకారంతో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి మంగళవారం తవాలను,కిరాణా సామగ్రి, బిస్కెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వాసవి క్లబ్ జిల్లా బాధ్యులు మంకాల నవీన్ కుమార్ మాట్లాడారు. క్లబ్ సభ్యులు శ్రీనివాస్,వీరేశం ఉన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌గా వెంకటేశ్వర్‌రెడ్డిని ప్రకటించాలి

సిద్దిపేట టౌన్,జూన్ 11 : ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌గా వెంకటేశ్వర్‌రెడ్డిని ప్రకటించాలని రెడ్డి సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి కోరారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రెడ్డి సంఘం బలోపేతం చేయడంలో వెంకటేశ్వర్‌రెడ్డి క్రియాశీలపాత్ర పోషించాడన్నారు. శ్రీనివాస్‌రెడ్డి,మైపాల్ రెడ్డి శ్రీనివాస్,రాంరెడ్డి,మల్లారెడ్డి,మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అమర్నాథ్‌లో అన్నదానం అదృష్టం

సిద్దిపేట టౌన్,జూన్ 11 : అమర్నాథ్‌లో అన్నదానం చేయడం అదృష్టమని అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ..అమర్నాథ్ యాత్రకు వ